క్లుప్తంగా

నేడు సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

కడియం: మురమండలో ఉన్న సర్వకామదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమవారం శాంతి హోమం, పంచసహస్ర పార్థివ లింగార్చన, శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దామెర్ల రవిబాబు, ఆలయ అర్చకులు సోమేశ్వర్ గురుకుల్ తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు శివలింగాలను అందజేయనున్నారు.

13 నుంచి దోసాలమ్మ సంక్రాంతి ఉత్సవాలు


బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక్రప్రకటనలో తెలిపింది. 13వ తేదీ భోగిరోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం భజన కార్యక్రమం, 14వతేదీ సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు, సాయంత్ర కచేరి, 15వ తేదీ కనుమ రోజున ఉదయం అమ్మవారి పంచలోహ విగ్రహం ఉయ్యాలసేవ, సాయంత్రం ఐదుగంటల నుంచి అమ్మవారి పంచలోహ విగ్రహ మూర్తిగా పురవీధులలో భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. 16వతేదీ ముక్కనమ రోజున భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకోవచ్చన్నారు. 26వ తేదీ ఆదివారం అన్న సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

కల్కి అవతారంలో జనార్దనుడు


కల్కి అవతారంలో ధవళగిరి శ్రీలక్ష్మీజనార్దనస్వామి

ధవళేశ్వరం: ధనుర్మాసం సందర్భంగా ధవళేశ్వరం గ్రామంలోని ధవళగిరిపై వేంచేసియున్న నవజనార్దనుల్లో ప్రథముడైన శ్రీలక్ష్మీజనార్దన స్వామి వారిని ఆదివారం కల్కి అవతారంలో అలంకరించారు. భక్తులు జనార్దనస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు(కాసులు), పవన్‌కుమార్ పూజలు నిర్వహించారు.

సీఎం హామీ నమ్మి ఆందోళన విరమించండి

సీటీఆర్ఐ: పేపరు మిల్లు కార్మికులకు నష్టం జరగకుండా మంచి అగ్రిమెంటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి కార్తికేయ మిశ్రాకు ఆదేశాలు ఇచ్చారని, ఇప్పటికే కార్తికేయ మిశ్రా ఆ పనిలోనే ఉన్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. వేతన ఒప్పందం కోసం పేపరు మిల్లు వద్ద మిల్లు యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన కార్మికులను ఆదివారం కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు కలిసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కార్మికుల అభిప్రాయం తెలుసుకున్నారు. సీఎం హామీ నమ్మి కార్మికులు ఆందోళన విరమించాలని కోరారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, జనసేన పార్టీ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ,గ్రావెన్
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప-2
అనుశ్రీ	: మార్కో
రాజా	: పుష్ప-2
రంభ	: బచ్చలమల్లి
ఊర్వశి	: గ్రావెన్
మేనక	: ఆటోరంగ, చేతిలో చెయ్యేసి చెప్పుబావ
కుమారి	: రఘువరన్ బిటెక్
అప్సర	: పుష్ప-2
అశోక	: మార్కో
నామవరం	
విఎస్.మహల్	: పుష్ప-2, గ్రావెన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: పుష్ప-2
కడియం	
వెంకటసూర్య	: మార్కో, పుష్ప-2

స్వచ్ఛమేవ జయతే!

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి
- అప్పుడే దేశంలో నగరాలతో పోటీపడి మంచి ర్యాంక్ సాధించే అవకాశం
- తడిచెత్త, పొడిచెత్త ఇవ్వకపోతే జరిమానా
- నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్


పారిశుధ్య నిర్వహణపై సూచనలిస్తున్న అధికారులు

జరిమానాలు ఇలా...

- షాపులు, అపార్ట్‌మెంట్స్ వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేయకపోతే రూ.5 వేలు
- తడిచెత్త, పొడి చెత్త వేరు చేయకపోతే రూ.50 నుంచి రూ.5 వేలు
- బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన - రూ.50 నుంచి రూ.100
- బహిరంగ ప్రదేశంలో చెత్త వేస్తే రూ. 500 నుంచి రూ.5 వేలు
- ప్లాస్టిక్ వస్తువులు వాడితే రూ.50 నుంచి రూ.5వేలు

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో దేశంలో అత్యున్నత ర్యాంక్ సాధనకు అవసరమైన చర్యలకు నగర పాలక సంస్థ శ్రీకారం చుట్టింది. నగరంలో 50 డివిజన్‌ను 138 లోకేషన్లుగా విభజించి పదిమంది సభ్యులతో స్వచ్ఛ సర్వేక్షణ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి స్వచ్ఛ రాజమహేంద్రవరం సాధించేందుకు సమాయత్తమైంది. ఈ కమిటీ ప్రతీ రోజూ ఈ లోకేషన్లలో తిరుగుతూ నిరంతర పర్యవేక్షణ చేపట్టనుంది. అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు భాగస్వాములు అయినప్పుడే దేశ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధనకు అవకాశం ఉంటుందని కమిషనర్ కేతన్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఫిబ్రవరి నెలలో ఢిల్లీకి చెందిన స్వచ్ఛ భారత్ మిషన్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో ప్రజలు బాధ్యతతో స్వచ్ఛ నగరంలో భాగస్వాములు కావాలని కోరారు. సామాజిక భద్రత అంశమే లక్ష్యంగా నగర పౌరులు కృషి చేయాలన్నారు. దేశంలో సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధనకు నిరంతర పర్యవేక్షణతో చర్యలు చేపడుతున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. నగరంలో అపరిశుభ్రతను నియంత్రించేందుకు అనేక చర్యలు చేపడుతున్నట్టు ప్రకటించారు. దీనిలో భాగంగా నగరంలో కమర్షియల్ ఏరియాలలో చెత్త సేకరణ కోసం 100 డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నిర్దేశిత ప్రాంతాల్లో చెత్త వేయని పక్షంలో జరిమానాలు విధిస్తామని ప్రకటించారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయకుండా కార్మికులకు చెత్త అందించినా, వ్యాపారాలు సాగిస్తున్న తోపుడుబండ్లు, హోటల్స్, కమర్షియల్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో పారిశుధ్య నిబంధనలను పాటించకపోయినా జరిమానాలు విధించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ మానిటరింగ్ కమిటీ నిరంతరం పర్యవేక్షణ చేస్తుందని అధికారులు తెలిపారు.

నిరంతర పర్యవేక్షణ

నగరంలో పారిశుధ్య చర్యలు నిర్వహణతో పాటు


పారిశుధ్య చర్యలపై చర్చిస్తున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు (ఫైల్)

స్వచ్ఛనగర సాధనకు శానిటరీ అధికారులతో పాటు ఇంజినీరింగ్ అధికారులు, ప్రజా ఆరోగ్య శాఖ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి నిరంతర పర్యవేక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నిర్దేశిత లక్ష్యంతో ఈ లొకేషన్‌లో తనిఖీలు నిర్వహించే విధంగా విధి విధానాలను తయారు చేశారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణకు అన్ని విధాలా చర్యలు చేపట్టినట్టు అధికారులు చెబుతున్నారు. 2024 సంవత్సరంలో నగరానికి 59వ ర్యాంకు దక్కిందని దాన్ని అధిగమించి టాప్‌టెన్‌లో ఉండే విధంగా పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

2024లో రూ.21 లక్షల జరిమానా

నిబంధన పాటించని షాపులకు 2024లోనగర పాలక సంస్థ జరిమానాలు విధించింది. జనవరి నుంచి డిసెంబర్ వరకూ రూ.21 లక్షలు జరిమానాలు విధించినట్టు శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ తెలిపారు.

నిబంధనలను పాటించకపోతే జరిమానాలు తప్పవు



నగరంలో హోటల్స్, షాపులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద ఎవరికి వారే బాధ్యతగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకుని రోజువారీ వచ్చిన వ్యర్థాలను నగరపాలక సంస్థ శానిటరీ సిబ్బందికి అప్పగించాలి. ఈ నిబంధనలను పాటించని షాపులకు 50 రూపాయల నుంచి 5000 రూపాయల వరకు జరిమానాలు విధించేందుకు చర్యలు చేపట్టాం. నగరంలో పలు ప్రాంతాల్లో నిబంధనలను పాటించని షాపులకు ఒక్కొక్క షాపుకు రూ.2,000 చొప్పున జరిమానాలు విధించిన సందర్భాలున్నాయి. సామాజిక భద్రతే లక్ష్యంగా స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలి. ఆరోగ్యం, పరిశుభ్రత ప్రాధాన్యత అంశాలుగా దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరించాలి. ఇష్టానుసారంగా రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదు. సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధించేందుకు నగరంలో పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం. సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ సాగిస్తున్నారు.

– కేతన్ గార్గ్, కమిషనర్, నగర పాలక సంస్థ

టాప్ 10 సాధిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు



నగరపాలక సంస్థ పారిశుధ్య చర్యల నిర్వహణను పరిశీలించేందుకు ఫిబ్రవరిలో స్వచ్ఛభారత్ మిషన్ బృందం ఢిల్లీ నుంచి రానుంది. నగరం టాప్ టెన్ ర్యాంకు సాధించేందుకు ప్రజలు సహకరిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్తులో నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సాధించే అవకాశం ఉంది. నగరాన్ని అద్భుతంగా తయారు చేయాలంటే నగర ప్రజల సహాయ సహకారాలు ఎంతైనా అవసరం.

– ఇంద్రగంటి శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్

ఈ రోడ్డు కార్పొరేషన్‌దా... పంచాయతీదా?

పెట్రోల్ బంకు నుంచి పేపరుమిల్లు క్వార్టర్స్ గేటు వరకు పట్టించుకునేవారే కరవు


దుమ్ముతో ఉన్న పెట్రోల్ బంకు నుంచి మల్లయ్యపేట వెళ్లే రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: ఈ రోడ్డును నగరపాలక సంస్థ, పంచాయతీలు పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతంలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డు కార్పొరేషన్‌ది అని పంచాయతీ , పంచాయతీ వారిదని కార్పొరేషన్ వదిలేయడంతో అది మట్టి, ధూళితో నిండి ఉంది. ఇదీ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, కాతేరు పంచాయతీలకు మధ్య ఉన్న రోడ్డు పరిస్థితి. వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో పేపరుమిల్లు దాటిన తరువాత పెట్రోల్ బంకు వరకు పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. అక్కడ నుంచి కాతేరు గ్రామపంచాయతీది అని చెప్పి అక్కడ వరకు చేసి వెళ్లిపోతున్నారు. కాతేరు గ్రామపంచాయతీ సిబ్బంది పేపరుమిల్లు క్వార్టర్స్ గేటు వరకు శుభ్రం చేసి అక్కడ నుంచి నగరపాలక సంస్థది అని వదిలేస్తున్నారు. దీనివల్ల పెట్రోల్ బంకు వద్ద నుంచి పేపరుమిల్లు క్వార్టర్స్ గేటు వరకు ఇటు నగరపాలక సంస్థ, గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో దుమ్ము,ధూళితో నిండిపోయింది. ఆ రోడ్డులో వాహనచోదకులు ప్రయాణించాలంటే భయపడిపోతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించే సమయంలో దుస్తులపై దుమ్ముపడి పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అక్కడ ఉన్న వ్యాపారులు సైతం దుమ్ము వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన నగరపాలకసంస్థ, పంచాయతీ అధికారులు స్పందించి ఆరోడ్డును శుభ్రం చేయించాలని సామాజిక కార్యకర్త పురుషోత్తం కోరుతున్నారు.

వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ కార్యవర్గం ప్రమాణం


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న నూతన కార్యవర్గం

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార ఉత్సవం ఆదివారం ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా -103 ఫాస్ట్ గవర్నర్ మాచవరపు భాస్కరరావు నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు శనపతి వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి గుబ్బల గంగాభవాని, కోశాధికారి ఉప్పులూరి కాశీ విశ్వనాథం, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ మనోజ్ఞ హాజరయ్యారు. వారి చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున 81మంది వృద్ధులకు పింఛన్లు, వారణాసి కామేశ్వరి పేద విద్యార్థినికి పంపిన రూ.15 వేలును బి.ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్ అమూల్యకు క్లబ్ తరపున అందించారు. క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, అనసూరి శ్రీనివాస్, శీలం రామకృష్ణ, పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

మధురపూడి: కోరుకొండలో వేంచేసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, స్థానిక బస్‌స్టాండ్ సెంటర్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం తిరుప్పావై ప్రవచనాలు, భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు, సేవాకాలం, తీర్థ ప్రసాదాల గోష్ఠి జరిగాయి.

మూతపడిన పడవ ర్యాంపులు

- గత నెలాఖరుతో ముగిసిన అనుమతులు
- పొడిగింపు ఉత్తర్వులు రాక ఇసుక తవ్వకాల నిలిపివేత
- వేలాది పడవ కార్మికుల ఉపాధికి విఘాతం
- కదలని ఇసుక రవాణా వాహనాలు


తవ్వకాలు లేని కొవ్వూరులోని ఏరినమ్మ బోట్స్‌మన్ ర్యాంపు. ఖాళీగా ఉన్న పడవలు, లోడింగ్ యంత్రాలు


కొవ్వూరు మండలం వాడపల్లి బోట్స్‌మన్ ర్యాంపులో ఇసుక నిల్వలు, పడవలు

కొవ్వూరు: డివిజన్‌లో పడవల ద్వారా నడిచే ఇసుక ర్యాంపులన్నీ మూతపడ్డాయి. ఈ తరహా ర్యాంపులకు డిసెంబర్ నెలాఖరు వరకూ అనుమతులిస్తూ సెప్టెంబర్‌లో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ర్యాంపులకు ముగిసిన గడువును పొడిగించడంలో కూటమి సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. గత నెలాఖరుకు గడువు ముగుస్తుందని తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వేలాది మంది ఉపాధితో ముడిపడి ఉన్న ఇసుక ర్యాంపులు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ర్యాంపుల్లో వేలాది టన్నుల ఇసుక నిల్వలున్నాయి. బోట్స్‌మన్ సొసైటీల ఆధ్వర్యంలో నడిచే ర్యాంపులను కూడా నిర్వహణ ఏజెన్సీలకు అప్పగిస్తారనే ప్రచారం సాగుతోంది. దాంతో బోట్ల యజమానులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో ఏడు డీ సిల్టేషన్ ర్యాంపులు నడిచేవి. అవి వాడపల్లి, ఔరంగాబాద్-1,2, దండగుండరేవు-1,2, ఏరినమ్మ, కొవ్వూరు ర్యాంపులు. ఈ ఏడు ర్యాంపుల్లో 300కి పైగా బోట్లు పని చేసేవి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వాటిపై ఆధారపడి సుమారు 10 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. డివిజన్ పరిధిలో సుమారు రెండు వేల లారీలు నిత్యం ఇసుక రవాణా చేస్తున్నాయి. ఈ విధంగా కూడా ఎందరికీ ఉపాధి లభిస్తోంది. ఇప్పుడు ర్యాంపులు మూతపడడంతో పడవ కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. జిల్లావ్యాప్తంగా రెండు లక్షల మంది భవన నిర్మాణ రంగ కార్మికుల ఉపాధి కూడా ఇసుక సరఫరాపైనే ఆధారపడి ఉంది. ఇంత మంది కార్మికుల ఉపాధితో ముడిపడిన ర్యాంపుల పట్ల కూటమి సర్కారు శ్రద్ధ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

డ్రెడ్జింగ్‌కి రంగం సిద్ధం?

వేలాది మంది ఉపాధితో ముడిఉన్న బోట్స్‌మన్ ర్యాంపుల్లోనూ డ్రెడ్జింగ్ చేయించాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. బోట్స్‌మన్ ఇసుక ర్యాంపులను సైతం కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్వహణ సంస్థలకు అప్పగించి దండుకోవాలనేది ప్రభుత్వ పెద్దల యోచన. యంత్రాలను వినియోగించి డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక సేకరిస్తే పడవ కార్మికులు పూర్తిగా ఉపాధి కోల్పోతారు. అందుకే కొన్నేళ్లుగా వాడపల్లి, ఔరంగాబాద్ ప్రధాన ర్యాంపుల్లో డ్రెడ్జింగ్‌ను వ్యతిరేకిస్తున్నారు. ర్యాంపులకు ఇచ్చిన గడువు ముగియడంతో నిర్వహణ బాధ్యతను బోట్స్‌మన్ సొసైటీల స్థానంలో కాంట్రాక్ట్ సంస్థకు అప్పగిస్తారని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఇదే జరిగితే బోట్స్‌మన్ ర్యాంపులు తెరుచుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బోట్స్‌మన్ సొసైటీల నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలసి తమగోడు వెళ్లబుచ్చుకున్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ శని లేదా సోమవారం సమావేశమై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు



బోట్స్‌మన్స్ సొసైటీల ఇసుక ర్యాంపులను ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెన్యూవల్ ప్రక్రియపై ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇసుక తవ్వకాలకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. సాధ్యమైనంత తొందరలోనే ర్యాంపులు తెరిపించేందుకు ప్రయత్నిస్తాం.

– రాణి సుస్మిత, ఆర్డీవో, కొవ్వూరు

ఓపెన్ రీచ్‌ల అనుమతులు 9.. నడిచేవి మూడే

డివిజన్‌లో తొమ్మిది ఓపెన్ రీచ్‌లకు అనుమతి ఇచ్చారు. వాటిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తున్న నిడదవోలు మండలం జీడిగుంట ర్యాంపును మూసి వేశారు. తీపర్రు-2,3 ర్యాంపులు రెండింటినీ పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రభుత్వ పనుల నిమిత్తం కేటాయించారు. కుమారదేవంలో 1,2 ర్యాంపులకు అనుమతిచ్చారు. గోదావరి నదిలో నీరు అధికంగా ఉండడంతో ఈ రెండు ర్యాంపులూ ఇంకా తెరుచుకోలేదు. చిడిపి ర్యాంపు వద్దా ఇదే పరిస్థితి. ఇక ప్రస్తుతం పెండ్యాల-కానూరు, పందలపర్రు ర్యాంపులతో పాటు బల్లిపాడు ర్యాంపులు నడుస్తున్నారు. ప్రధానంగా పెండ్యాల, పందలపర్రు ర్యాంపుల్లో స్థానిక వాహనదారులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ఇసుక కోసం వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


మళ్లీ ఇసుక ధరలకు రెక్కలు?

ఇసుక కష్టాలు మళ్లీ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. డివిజన్‌లో ఏడు డీ సిల్టేషన్ ర్యాంపులతో పాటు మరో తొమ్మిది ఓపెన్ ర్యాంపులున్నాయి. వాటిలో బోట్స్‌మన్ ర్యాంపులు పూర్తి మూతపడగా, ప్రస్తుతం కేవలం మూడు ఓపెన్ ర్యాంపులే నడుస్తుండడంతో ఇసుక ధరలకు మళ్లీ రెక్కలొచ్చే అవకాశం ఉంది. ఇసుకకు కృతిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉంది.

సరస్వతీ ఘాట్‌లో స్వచ్ఛ భారత్

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు 48 మంది గోదావరి జలాలలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి శుభ్రం చేశారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆలయ స్తంభాలను గుడ్డతో తుడిచారు. ఈ కార్యక్రమానికి మాజీ కమిషనర్, విశ్రాంత ఆర్డీవో ఎం.జితేంద్ర, రాజమహేంద్రవరం ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఎఫ్ఎస్ఎస్ సభ్యులు పి.వి.ఎస్.కృష్ణారావు, జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకులు తోట సుబ్బారావు హాజరయ్యారు. కార్యక్రమాన్ని డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు రూపకల్పన చేయగా, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, పోలుకొండ సాయి, శిరీష, ఎన్.ఎస్.ఎస్. వలంటీర్లు మానీషు, అలీ, వినయ్, ఎన్ఎస్ఎస్ లీడర్ సుమ పాల్గొన్నారు.

● స్వామికి ఫలంకరణ



బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో కొలువైన ఉన్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారం అర్చకులు బిక్కవోలు రాఘవహర్షవర్ధన్, బిక్కవోలు రాఘవరాం స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆరెంజ్, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష తదితర పండ్లు, పూలతో అలంకరణ చేశారు.

హైందవ శంఖారావానికి తరలివెళ్లిన భక్తులు


కాతేరు నుంచి హైందవ శంఖారావానికి తరలివెళ్తున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: హైందవ శంఖారావం చలో విజయవాడ కార్యక్రమానికి బస్సుల్లో భారీ సంఖ్యలో విజయవాడ వెళుతున్నట్టు కాతేరు బస్తి ప్రముఖ తొగరుసత్యనారాయణ, బీఎంఎస్ సత్యకుమార్ తెలిపారు. హిందూ ఆలయాలను పరిరక్షించేందుకు భారీ ఎత్తున లక్షల మందితో జరిగే సభకు పెద్ద ఎత్తున మహిళలు యువకులు పాల్గొంటున్నారన్నారు. చలపతి, బీజేపీ నాయకులు చాగంటి కోటేశ్వరరావు, యానాపు ఏసు, బి.వి.రామారావు, పిల్లి మనమ్మ, ఆకుల కుమారి, పిచ్చుక రాంబాబు, గోవిందు, గురజాడ రాజేశ్వరి, శివయ్య, భద్రరావు, పరశురాం, గోవిందు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహాభాగవత ప్రవచనం


మహాభాగవతం ప్రవచనం చేస్తున్న నాగఫణిశర్మ

పెదపూడి: అనపర్తి శారదా సంగీత కళా సమితి 26వ త్యాగరాజు ఆరాధన ఉత్సవాల మూడో రోజు ఆదివారం ఆంధ్ర మహాభాగవతంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. మహాకవి, అవధాన సహస్రఫణి, అవధాన సరస్వతి పీఠం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం అందర్నీ ఆకట్టుకుంది. ఆంధ్ర మహాభాగవతం నుంచి ముఖ్య ఘట్టాలను శ్రోతుల కళ్లకు కట్టినట్టు వివరించారు. రుక్మిణీ కల్యాణ ఘట్టాన్ని వివరిస్తూ భగవంతుడైన శ్రీకృష్ణుణ్ణి రుక్మిణీదేవి ఏ విధంగా ప్రార్థించి వివాహం చేసుకుందో వివరించారు. పోతన పద్యాలను చక్కగా వివరించారు. భగవంతుని అనుగ్రహం మేరకు మహాభాగవతం ఆంధ్రీకరించానని, తన సొంత ప్రయత్నం లేదని పోతన చెప్పిన విధానాన్ని నాగఫణిశర్మ ఆద్యంతం అందరినీ ఆకట్టుకునే విధంగా తెలిపారు. మధ్యాహ్నం టీటీడీ కల్యాణ మండపంలో ఉమా రామలింగేశ్వర వేద శాస్త్ర పరిషత్ 32వ వార్షికోత్సవం సందర్భంగా వేద సభ నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఉప్పులూరి సత్యనారాయణ అవధాని అధ్యక్షతన వేద పండితులు సుమారు మూడు గంటల పాటు వేద గోష్ఠి నిర్వహించారు. దీంతో అనపర్తి గ్రామం వేద ఘోషతో నిండిపోయింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్రి రామారెడ్డి హాజరవ్వగా వి.వి.తిలక్‌కుమార్ సౌజన్యంతో నిర్వహించారు.